క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

నల్లమాడ: పాతబత్తలపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని కే.బత్తలపల్లి, పాతబత్తలపల్లి, ఆది ఆంధ్రపల్లి, చెంగ్రాయునిపల్లి, ఎస్.ఎనుమలవారిపల్లి గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

ఓడీ చెరువు: మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలకు ఈనెల 20వ తేదీన స్థానిక పోలీసుస్టేషన్‌లో నల్లమాడ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ గోపి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.2 వేల ధరావత్తు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర


పూజలందుకున్న పెద్దమ్మ దేవత

ముదిగుబ్బ: మండల పరిధిలోని అడవి బ్రాహ్మణపల్లి తండా, రామస్వామి తండాల్లో బుధవారం మారెమ్మ, పెద్దమ్మ దేవతల జాతరను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో దేవాలయాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. అమ్మవారికి జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న గంగన్నగారిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామస్వామి ఆలయ నిర్మాణానికి విరాళంగా రూ.50 వేలను ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ చేతుల మీదుగా బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జయ, చంద్ర, సూరి, పెద్దక్రిష్ణ, వెంకటరమణ, పెద్దన్న, శ్రీనివాసులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువులు, చింత చెట్ల వేలం

నల్లమాడ: నల్లమాడ గ్రామ పంచాయితీ పరిధిలోని చేపల చెరువులు, చింత చెట్లకు బుధవారం సచివాలయం-1 ఆవరణలో సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. కుటాలపల్లి చెరువు, కురుకుంట్ల చెరువు, పాతర్లకుంట, అప్పయ్యగారిపల్లి కుంట, ఎద్దులవాండ్లపల్లి తండా కుంటను రూ.16 వేలకు పలువురు దక్కించుకున్నారు. అలాగే 30 చింతచెట్ల ఫలసాయానికి సంబంధించి రూ.9 వేలు ధర పలికినట్లు పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలోని తాడిమర్రి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ నాగరాజు కుటుంబానికి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్ బుధవారం కార్పస్ ఫండ్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఏఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

షహమీర్ ఔలియా దర్గాలో ప్రార్థనలు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: స్థానిక ఎగువపేటలోని షహమీర్ ఔలియా దర్గాలో బుధవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత దర్గా గురువు ఖాదిమానే ఆస్తాన్ షహమీర్ ఔలియా ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించారు. దుశ్శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. అనంతరం దర్గాలో గురువు సమాధి వద్ద పూలు, చక్కెర సమర్పించి ప్రార్థనలు చేయించారు. ఎంపీపీ రఫీ నాయక్, మున్సిపల్ చైర్మన్ పరికి షామీర్, మాజీ సర్పంచ్ పయాజ్ అహమ్మద్, ఉపసర్పంచ్ డిక్‌బాబు (కృష్ణారెడ్డి), రాజగోపాల్‌రెడ్డి, సధారెడ్డి, వలి పాల్గొన్నారు.

పథకాలతో పేదలకు భరోసా



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు రామలక్ష్మమ్మ. పుట్టపర్తి మున్సిపాలిటీలోని 2వ వార్డులో నివాసం ఉంటోంది. మూడున్నరేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500, వైఎస్సార్ సున్నావడ్డీ కింద రూ.2,084, వైఎస్సార్ ఫించన్ కానుక ద్వారా రూ.12,500, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.16,714 లబ్ధి పొందింది. సీఎం వైఎస్ జగనన్న మేలును ఎప్పటికీ మరువమని, మళ్ళీ ఆయనకే మా మద్దతు ఉంటుందని రామలక్ష్మమ్మ చెబుతోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు మంగమ్మ, పుట్టపర్తి మున్సిపాలిటీలోని 2వ వార్డు కోటవీధిలో ఉంటోంది. ఈమె కుటుంబానికి వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500, వైఎస్సార్ సున్నావడ్డీ ద్వారా రూ.818, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.40,500, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82,500, వైఎస్సార్ సున్నావడ్డీ (రైతులు) ద్వారా రూ.1,984 లబ్ధి చేకూరింది. సీఎం జగన్ తమకు అన్ని విధాలా భరోసా ఇచ్చారని మంగమ్మ హర్షం వ్యక్తం చేసింది. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదిస్తామని తెలిపింది.


వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

- సీఎం జగన్ పాలన బాగుంది..
- పారదర్శకంగా పథకాలు అందుతున్నాయి
- గడప గడపకూ మన ప్రభుత్వంలో లబ్ధిదారుల హర్షం

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు బాగున్నాయి. పేదల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నాయని లబ్ధిదారులు కొనియాడారు. పారదర్శక పాలన సాగిస్తున్న జగన్ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలో 2వ వార్డు పెద్దబజారు, కోటవీధి, గ్రౌండ్ ఏరియా పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి వార్డు ప్రజలు పూలమాలతో స్వాగతం పాలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను చిరునవ్వుతో పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి, జగన్‌కు అండగా నిలవాలని కోరారు. పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి, పథకాలు అందజేస్తున్నారన్నారు. 90 శాతం ప్రజలు సంక్షేమ పథకాల పట్ల సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రాబోవు రోజుల్లో మరింత సమర్థవంతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి ఖాయం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి అందజేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నేషనల్ మీడియా 20 ఎంపీ సీట్లు గెలువబోతున్నారని సర్వేలో చెప్పడంతో అది ఓర్వలేక రాకీయంగా ఎదుర్కొన లేక ప్రజలకు మాయ మాటలు చెబుతూ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మెన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, పట్టణ, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి, సూర్యాగౌడ్, పవన్ కుమార్, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి నాయకులు గోపాల్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, కవిత, నాగరాజు, సాయి, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం మాది
- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: 'ప్రజల సమస్యలు పాదయాత్ర ద్వారా తెలుసుకొని,అధికారంలోకి రాగానే చెప్పిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుంది. మాది ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం..' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బుధవారం పట్టణంలోని 32వ వార్డులో పర్యటించారు. గడప గడపకూ వెళ్లి సంక్షేమ ఫలాలు ఏ మేరకు అందాయని ఆరా తీశారు. ప్రభుత్వం పట్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. గత టీడీపీ పాలనలో అర్హులైనప్పటికీ సంక్షేమ ఫలాలు అందాలంటే ఆ పార్టీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అర్హులందరికీ ఎలాంటి సిఫారసు లేకుండానే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని సంతోషం వెలిబుచ్చారు. వాణీ వీధి, రాజేంద్ర ప్రసాద్ వీధి, లాల్ బహదూర్ శాస్త్రి వీధుల్లో ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఇంకొన్ని త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఎల్లో రాతలు నమ్మొద్దు: జగన్ పాలనపై ఎల్లో పత్రికల్లో వచ్చే అసత్యపు వార్తలు నమ్మకండి.. అని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు ఏపీలో అమలు చేస్తున్నామని, దేశానికే ఏపీ రోల్ మోడల్..అన్నారు. ప్రతిపక్షాలు దీన్ని జీర్ణించుకోలేక లేని పోని ఆరోపణలు చేస్తున్నాయని వాటిని నమ్మొద్దు అని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలతో జగనన్న తన పాలనను ప్రజల చెంతకే తీసుకొచ్చారని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నిజాం, మున్సిపల్ వైస్ చైర్మెన్ రాజశేఖర్‌రెడ్డి, కమిషనర్ శ్రీహరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: కొత్తచెరువు వైస్ ఎంపీపీ దండగల సరళ భర్త వడ్డె రామచంద్ర మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. బుధవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని తెలిపారు. పార్టీ పరంగా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అలాగే పార్టీ సీఈసీ సభ్యుడు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు దుద్దుకుంట శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్ రెడ్డి తదతరులు రామచంద్ర మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు, టౌన్ కన్వీనర్ వడ్డె భాస్కర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, నాయకులు మటన్ శంకర్, దాల్ మిల్ సూరి, అంగడి సోమశేఖర్ రెడ్డి, వాల్మీకి శంకర్, వెంకటరాముడు, పెయింటర్ కేశవ, బోయ యల్లప్ప, బాబు, డీలర్ శీన, సుబ్బారావు, గిరి, అశోక్ రెడ్డి, రాజారెడ్డి, రఫీ, బోయ రాము, షాన్‌షేట్, మధు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి బస్టాండ్‌లో కదిరి ప్రేమజంట

- పోలీసులకు అప్పగించిన ఆర్టీసీ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: అనంతపురం జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఓ ప్రేమజంట తిరుమలలో పెళ్లి చేసుకున్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని అనంతపురం ప్లాట్‌ఫాం వద్ద ఆర్టీసీ సెక్యూరిటీకి అనుమానాస్పదంగా కనిపించారు. సెక్యూరిటీ వారిని విచారించగా.. వివాహం చేసుకున్నట్లు తెలిపారు. వెంటనే సెక్యూరిటీ వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బెంగుళూరు సిటీలోని కొన్నగుంట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుసుకున్నారు. బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న పోలీసులు వెంకటేశ్వర్లు, కొండారెడ్డి ఆ ప్రేమ జంటను ఈస్ట్ పోలీసులకు అప్పగించారు. బాలిక వయస్సు (15), యువకుడి వయస్సు (21)గా వెల్లడించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ రమణ

కదిరి: రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు-భద్రతా నియమాలు పాటించాలని కదిరి మోటారు వాహనాల తనిఖీ అధికారి డి.ఎస్.ఎం వరప్రసాద్ పేర్కొన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పలు విషయాలు చెప్పారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే మరింత ప్రమాదమన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం కూడా తప్పని చెప్పారు. మృతి చెందిన వారిలో అధిక శాతం కుటుంబ పెద్దలు లేదా కుటుంబ పోషకులే ఉండటం బాధాకరమన్నారు. దీంతో వారిపై ఆధార పడిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు-భద్రతా నియమాలు పాటిస్తే పాదచారులు, వాహనాలు నడిపే వారితో పాటు అందులో ప్రయాణించే వారికి కూడా క్షేమదాయకమన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల19న కదిరిలో లారీ, మినీ లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లతో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. ఈనెల 24 వరకూ రోడ్డు-భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తామని, విజయవంతం చేయాలని కోరారు.

ఓడీ చెరువు: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎంవీఐ రమణ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం బుక్కపట్నంలోని తేరు బజారు, డిగ్రీ కళాశాలలో వేర్వేరుగా ఆటో, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించినప్పుడే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు.

ఇంటి ముంగిటకే వైద్యం


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి ముంగిటే మెరుగైన వైద్యం లభిస్తుందని వైద్యాధికారి మహేంద్రనాథ్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని చిల్లవారిపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. ఇంటింటా తిరుగుతూ దీర్ఘకాలిక వ్యాధుల రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ వైద్య చికిత్సల కోసం వ్యయప్రయాసాలకోర్చి 25 కిలోమీటర్ల దూరంలోని పీహెచ్‌సీకి వెళ్లకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లోనే వైఎస్సార్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిందన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో నెలలో రెండు రోజులు గ్రామానికి వచ్చి వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు సోకవన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు


గంటాపురంలో బ్రోచర్లు పంపిణీ చేస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పారదర్శక పాలన సాగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వేల్పుమడుగులో 'గుడ్ మార్నింగ్ ధర్మవరం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. పథకాలతో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడేళ్ల పాలనలో పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లు అందజేశారు. పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, సర్పంచు ఆక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట ఆంజనేయులు, ఉప సర్పంచు కోళ్లమొర్రం చెన్నకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, నరేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జాంపుల చంద్రమోహన్, నాగభూషణ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు జియోట్యాగ్ తప్పనిసరి


లబ్ధిదారులకు సూచనలిస్తున్న అధికారులు

ఓడీ చెరువు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులకు సంబంధించి తప్పనిసరిగా జియోట్యాగ్ చేయించుకోవాలని ఎంపీడీఓ పోలప్ప, హౌసింగ్ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మిట్టపల్లి, తంగేడుకుంట ,అల్లాపల్లి గ్రామాల్లో మ్యాపింగ్, జియోట్యాగ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు తప్పనిసరిగా జియోట్యాగ్ చేయించుకున్న తర్వాత ప్రభుత్వం సిమెంట్ మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలంటూ ఈఓఆర్డీ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికీ తిరుతుగుతూ ప్రచారం చేశారు. అలాగే ఇంటి పన్ను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అబీదాబాను,షేక్ షాజీయా, గ్రామ సహాయక ఇంజినీర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించుకోండి

బత్తలపల్లి: జగనన్న లేఅవుట్లలో రోడ్లను ఆక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారు వెంటనే తొలగించుకోవాలని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అప్పరాచెరువులోని జగనన్న లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. కాలనీలో 70 ఇంటి పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అందులో 15 మంది రోడ్డును ఆక్రమించుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. ట్రాన్స్‌కో అధికారులు రోడ్డుపై విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఆక్రమణలను రెడ్ మార్కు వేసి, గుర్తించామన్నారు. ఆక్రమణదారులే తొలగించుకోవాలని లేదంటే పంచాయతీ కార్మికులు తొలగిస్తారన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ దేవాలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న సుప్రియ

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో నూతనంగా నిర్మించనున్న గంగమ్మ దేవాలయానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి సుప్రియ బుధవారం రూ.50 వేలను విరాళంగా కాలనీవాసులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం: స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో బుధవారం తెల్లవారుజామున ఐచర్ వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన సత్యనారాయణ, ఆయన కుమారుడు మోహన్ కృష్ణ ద్విచక్రవాహనంలో స్థానిక రైల్వేస్టేషన్ వెళుతుండగా కళాజ్యోతి సర్కిల్‌లో ఎదురుగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. స్వల్ప గాయాలతో కుమారుడు బయటపడ్డాడు. గాయపడిన సత్యనారాయణను స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన డ్రైవర్.. వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

పుట్టపర్తి టౌన్: పచ్చదనాన్ని పెంపొందించడమే గ్రీన్ భారత్ ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ పర్యావరణ పరిరక్షకుడు శంకరనారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయిఆరామంలోని అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. గోరంట్ల, చిలమత్తూరు మండలాల్లో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో భావితరాలకు ప్రాణవాయువు కొనే పరిస్థితి రాకుండా మొక్కలను విరివిగా పెంచాలన్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణంలో మొక్కలు నాటి, వాటి పరిరక్షణకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుందన్నారు.

250 పడకల ఆసుపత్రిగా మార్చాలని వినతి

కదిరి అర్బన్: కదిరి ఏరియా ఆసుపత్రిని 250 పడకల ఆసుపత్రిగా మార్చి, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని బుధవారం ఆర్డీఓ రాఘవేంద్రకు ఏపీ మెప్మా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అలాగే కదిరిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఉర్దూ డైట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మెప్మా అధ్యక్షుడు ఖాదర్‌బాషా సభ్యులు చాంద్‌బాషా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

కదిరి టౌన్: టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు (ఎన్‌టీఆర్) 27వ వర్ధంతిని కదిరిలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద టీడీపీ నాయకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు పర్వీన్‌భాను, రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపిక


మహేష్‌ను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఓడీ చెరువు: మండల కేంద్రంలోని ఫకృద్దీన్ విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న మహేష్ రాష్ట్ర హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం తెలిపారు. ఇటీవల గన్నవరంలో జరిగిన అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న మహేష్ జిల్లా జట్టు తరఫున ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 26 నుంచి తమిళనాడులోని తిరుచానూరులో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

ద్విచక్ర వాహనం దగ్ధం

పరిగి: మండల కేంద్రంలో అల్లావుద్దీన్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతైంది. వివరాల మేరకు.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డులో నివాసముంటున్న అల్లావుద్దీన్ తన సూపర్ ఎక్సెల్ వాహనాన్ని ఇంటి వద్ద పార్క్ చేశాడు. బుధవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం మంటలకు ఆహుతై కాలిపోయింది. ఎవరైనా వాహనానికి నిప్పు పెట్టారా? లేదా వేరే ఏదైనా అగ్ని ప్రమాదం జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.